





భద్రత పదిలం..!

● మరో 10 'సఖి' కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం ● కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు
● మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యం ● 24 గంటలూ అందుబాటులో హెల్ప్‌లైన్

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యానికి గురైన మహిళలకు ఆశ్రయం కల్పించే 'సఖి' వన్‌స్టాప్ సెంటర్లకు రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మరో పది కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో సఖి కేంద్రాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇటీవలికాలంలో కుటుంబ దౌర్జన్యాలు, పోక్సోకేసులు అధికమైన తరుణంలో రాష్ట్రంలో మరో పది 'సఖి' కేంద్రాల స్థాపనకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ అభివృద్ధిశాఖ తీర్మానించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 39 సఖి కేంద్రాలు పనిచేస్తున్నాయి. దౌర్జన్యానికి గురైన మహిళలకు తాత్కాలిక ఆశ్రయం, న్యాయం, చికిత్స, కౌన్సెలింగ్, న్యాయ సేవలు కల్పించేందుకు వీలుగా 'సఖి' వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో ఒక్కో సేవ పొందేందుకు వివిధశాఖలను ఆశ్రయించాల్సి వచ్చేది. అత్యాచారానికి గురైన వారు, యాసిడ్ దాడి , కుటుంబ దౌర్జన్యాలకు గురైన బాధిత మహిళలకు న్యాయం కల్పించడం, వివిధశాఖల సమన్వయం పొందడానికి ఎంతో శ్రమించాల్సి ఉండేది. వీటికి పరిష్కారం చెప్పేలా అన్ని సేవలను ఒకే చోట పొందేందుకు 'గెళతి' పేరిట కేంద్రాన్ని తెరిచారు. క్రమేణా వీటికి డిమాండ్ పెరగడంతో 2017-18లో కేంద్రప్రభుత్వం వీటి నిర్వహణ చేపట్టి 'సఖి'గా పేరుమార్చారు.



నగరంలో సఖి సెంటర్

2017లో తొలి సఖి కేంద్రం

2017లో ఉడుపిలో తొలి 'సఖి' కేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం 2019లో బెంగళూరులో ఒక సెంటర్‌ను తెరిచారు. తర్వాత దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా 39 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 7,400మందికిపైగా వీటి ప్రయోజనం పొందారు.

తక్షణ వైద్యసేవలకోసం...

దౌర్జన్యానికి గురైనవారికి వెంటనే వైద్య చికిత్సలు అందించాల్సిన అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులకు అనుబంధంగా 'సఖి' కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని 'సఖి' కేంద్రాల్లో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. ప్రతి 'సఖి' సెంటర్‌లో పాలనా పరమైన కౌన్సెలింగ్ అధికారి, ఇద్దరు న్యాయ సలహాదారులు, ఇద్దరు సమాజసేవకులు, ఇద్దరు స్వచ్ఛతా సిబ్బంది/సెక్యూరిటీ ఉండేలా ఏర్పాటు చేశారు. సిబ్బందికి వేతనాలు, సెంటర్ నిర్వహణ ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.



ఎవరెవరికి అండగా ఉంటుందంటే...

'సఖి' కేంద్రాలు కుటుంబ దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురైనవారు, యాసిడ్ దాడికి గురైన మహిళలకు అండగా ఉండి జీవనానిక భరోసా ఇచ్చేలా ఉంటాయి. అంతేకాక కనిపించకుండా పోయిన వారికి, సైబర్ మోసాలకు గురైనవారికి, వరకట్న వేధింపుల బాధితులకు, కాలిన గాయాలతో బాధపడుతున్న మహిళలకు ఇక్కడ సేవలు అందుతాయని, రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలున్నాయని స్త్రీశిశు సంక్షేమశాఖ (బెంగళూరు నగర జిల్లా) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ సిద్దరామణ్ణ తెలిపారు.

381కి పైగా కేసులు..

2019లో బెంగళూరులో ఒక 'సఖి' కేంద్రాన్ని తెరిచారన్నారు. ఇక్కడ కేసులు పెరగడంతో డివిజన్ పరిధిలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మెజస్టిక్ బీఎంటీసీ బిల్డింగ్, ఆనేకల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి, గోవిందరాజనగర్‌లోని మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి, యలహంకలోని ప్రభుత్వ ఆసుపత్రి, కేఆర్ పుర ప్రభుత్వ ఆసుపత్రిలలో 'సఖి' కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటివరకు 381కుపైగా కేసులు నమోదయ్యాయన్నారు. నిత్యం బాధితులకు అండగా నిలుస్తూ, సిబ్బంది తక్షణమే స్పందిస్తున్నారన్నారు.

హెల్ప్‌లైన్ 181

ఎలాంటి దౌర్జన్యానికి గురైన మహిళలు కూడా సహాయవాణి 181కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చునన్నారు. 'సఖి' కేంద్రానికి రావడానికి వాహన సదుపాయం ఉంది. హొయ్సళ (స్థానిక పోలీసు గస్తీ) వాహనంలో కూడా రావచ్చు. ఇదివరకు సఖి కేంద్రంలో గరిష్ఠంగా ఐదురోజులు ఉండే అవకాశం ఉండగా దీన్ని పదిరోజులకు పెంచారు. బెంగళూరు మడివాళలలో హెల్ప్‌లైన్ సెంటర్ 24 గంటలు పనిచేస్తోంది. రాష్ట్రంలోని బాధితులు ఎవరైనా 181కు ఫోన్ చేసి సాయం పొందవచ్చు.


గరుత్మంతుడిపై దర్శనమిస్తున్న శ్రీవారు

చూసిన కనులదే భాగ్యం..!

● వైభవంగా ఖాద్రీశుడి ప్రజాగరుడసేవ

కదిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి ప్రజా గరుడుడిపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో సోమవారం రాత్రి బయల్దేరిన శ్రీవారు మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. వెంటనే నిత్యపూజ, హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. సంధ్యాసమయంలో గరుడవాహనంపై కొలువుతీరిన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. విద్యుత్‌దీపకాంతుల నడుమ శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. బ్రహ్మరథోత్సవానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిట లాడుతోంది. వారికి వినోదం పంచడం కోసం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు గజవాహనంపై విహరిస్తారు. ఈవాహనం తరువాత రోజు బ్రహ్మరథోత్సవం జరగనున్నది. శ్రీవారి ఆలయం ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నది. ఐరావతంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గ్యారెంటీలతో పెరిగిన
కొనుగోలు శక్తి

● విధాన పరిషత్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేశంలో వందకోట్లమంది తమ అవసరాలను కొనుగోలు చేసే శక్తిని కోల్పోయారని, రాష్ట్రంలో గ్యారెంటీల అమలుతో కొనుగోలు శక్తి పెరిగిందని సీఎం సిద్దఅన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగంగా విధానపరిషత్‌లో మంగళవారం ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రపంచ అధ్యయన సంస్థలు, రాష్ట్రంలో అమలవుతున్న గ్యారెంటీలను ప్రశంసిస్తున్నాయన్నారు. బీజేపీ తమ గ్యారెంటీలను కాపీ చేసిందన్నారు. రాష్ట్రంలో ఐదు గ్యారెంటీల ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరుగుతోందన్నారు. ఈనెల 5న కేరళ ప్రభుత్వ అధికారుల బృందం గ్యారెంటీల అమలును అధ్యయనం చేసేందుకు వచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలోనూ శక్తి గ్యారెంటీ అమలు తీరును పరిశీలించేందుకు వచ్చారన్నారు. 2024-25 బడ్జెట్‌లో రూ.52వేల కోట్లు గ్యారెంటీలకు కేటాయించగా రూ.41,560 కోట్లు ఖర్చు చేశామన్నారు. కానీ రాష్ట్ర బీజేపీ నేతలు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వ విజయాలను వివరించారని, సంపూర్ణంగా వాస్తవాలు మాట్లాడారన్నారు. శాసనసభలలో చర్చలు అర్థవంతంగా ఉండాలని దిగజారుడు పనికి రాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు బీజేపీ సొంతంగా అధికారంలోకి రాలేదన్నారు. ఆపరేషన్ కమల ద్వారానే అధికారం చేపట్టిందన్నారు. యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ ప్రస్తావన వస్తే నోట్లు ముద్రించే యంత్రాలు లేవని అన్నారన్నారు. కానీ కేంద్రప్రభుత్వం అంబానీ, అదానీ వంటి వారికి వేల కోట్ల రూపాయలు వెసలుబాటు కల్పించిందన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 20శాతానికి తగ్గించి ప్రజలపై పన్నుల భారం మోపారన్నారు.

దళితుల ప్రగతికోసం సబ్‌ప్లాన్‌ను తీసుకొచ్చామన్నారు. బసవరాజ్ బొమ్మై సీఎంగా 1.66 లక్షలకోట్ల పనులను మంజూరు చేసి నిధులు విడుదల చేయలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్ రూ.4.09 లక్షలకోట్లకు పెరిగిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగా ఉండేలా నిబంధనలు పాటిస్తామన్నారు. ఆర్టికల్ 46 ప్రకారం ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ తర్వాత సబ్‌ప్లాన్‌ను అమలు చేసింది కర్ణాటకలో మాత్రమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడ్డామన్నారు. కృష్ణ ఎగువ ప్రాజెక్టుకు తీర్పు వచ్చి 13ఏళ్లు అవుతున్నా కేంద్రం ఇంకా గెజిట్ విడుదల చేయలేదన్నారు.

12న బెంగళూరు కరగ

బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ తర్వాత నగరంలో జరిగే అతిపెద్ద పండుగ బెంగళూరు కరగ ఏప్రిల్ 12న నిర్వహించనున్నారు. బెంగళూరు కరగకు సంబంధించి ధర్మరాయస్వామి ఆలయ నిర్వాహకులు తీర్మానించారు. కరగ ఉత్సవంపై మంగళవారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో సన్నాహక సభ జరిగింది. బెంగళూరు నగర జిల్లా అధికారి జగదీశ్ మాట్లాడుతూ కరగ ఉత్సవం సాగే ప్రాంతాల్లో రోడ్ల మరమ్మత్తులు చేపడతామన్నారు. వీధి దీపాలు బాగు చేస్తామన్నారు. కరగ మహోత్సవం ఏప్రిల్ 4నుంచి 14వ తేదీ వరకు జరిగేలా నిర్ణయించారు. పదిరోజుల పాటు పారిశుధ్య పనులు, భక్తులకోసం తాగునీరు, శౌచాలయ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న వైట్‌ట్యాపింగ్ పనులు మార్చిలోగా పూర్తి చేయాలని తీర్మానించారు. ధర్మరాయస్వామి దేవస్థానం చుట్టూ ట్రాఫిక్ నిబంధనలు విధించదలిచారు. సీసీ కెమెరాలను అమర్చడంతోపాటు ఆరోగ్య సిబ్బందిని, అంబులెన్స్ సదుపాయాన్ని కల్పించదలిచారు.

ఏప్రిల్ 4న శుక్రవారం రాత్రి 10 గంటలనుంచి 3 గంటల మధ్యన రథోత్సవం, ధ్వజారోహణ నిర్వహించదలిచారు. 5నుంచి 8వ తేదీ వరకు రాత్రి 7.30గంటలకు ప్రత్యేకపూజలు కొనసాగనున్నాయి. 9న రాత్రి 3 గంటలకు హారతులు దీపాలు ఇవ్వనున్నారు. 10న సంపిగె చెరువులో శక్తిపీఠం హసికరగ ఉత్సవం జరగనుంది. 12న శనివారం రాత్రి 12.30 గంటలకు కరగ శక్తి ఉత్సవం, ధర్మరాయస్వామి మహోత్సవం జరగనుంది. 13న రాత్రి 2గంటలకు పురాణ ప్రవచనం, గావు శాంతి ఉంటుంది. 14న వసంతోత్సవం, ధ్వజ అవరోహణతో ఉత్సవాలు ముగియనున్నాయి.


ధర్మరాయస్వామి ఆలయం

పరిషత్ సభ్యుడిగా రమేష్ కుమార్..?

● సభాపతిని మార్చే వ్యూహంలో అధికార పార్టీ



బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులకు వ్యూహాలు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతున్నా పరిషత్ సభాపతి స్థానాన్ని ఇంకా బీజేపీ-జేడీఎస్ కూటమికే ఉంది. ఆ స్థానాన్ని సీనియర్ నేత రెండేళ్లుగా క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్న కేఆర్ రమేష్ కుమార్‌తో భర్తీ చేయించాలనే వ్యూహాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాలకు ముందే సభాపతి మార్పు ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. అందుకు సభాపతి బసవరాజహొరట్టి కూడా స్పందించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే సభాపతి హోదాకు రాజీనామా చేస్తానని మరో ఆలోచన చేసేది లేదని తేల్చి చెప్పారు. తాజాగా రెండు రోజులుగా కొత్త అంశం వెలుగులోకి వచ్చింది. శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించిన రమేశ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ చేసి సభాపతి హోదాను కట్టబెట్టాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఏడాదిక్రిందట ఎమ్మెల్సీలను భర్తీ చేసే సందర్భంలో రమేష్ కుమార్‌కు అవకాశం ఇవ్వలేదనేది తెలిసిందే. పరిషత్‌లో 75మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. వారిలో బీజేపీ 29మంది, జేడీఎస్ తరపున ఏడుగురు ప్రాతినిథ్యం వహిస్తారు. కాంగ్రెస్‌కు 34మంది సభ్యులు ఉన్నారు. యూబీ వెంకటేశ్, ప్రకాశ్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. జేడీఎస్‌కు చెందిన తిప్పేస్వామి గడువు కూడా ముగిసింది. బీజేపీ ద్వారా నామినేట్ అయిన సీపీ యోగేశ్వర్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అయ్యారు. దీని ప్రకారం 4 ఖాళీలు ఉండగా నామినేటెడ్ విధానంతో భర్తీ చేసే అవకాశం ఉంది. ఇందులో ఒక స్థానాన్ని రమేశ్‌కుమార్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. గతంలోనే బసవరాజహొరట్టిని కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రస్తావన ఉండేది. అయితే ఆయన బీజేపీలో చేరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఏడోసారి ఎమ్మెల్సీ అయ్యారు. బహుశా దేశంలో అత్యధిక సార్లు ఒకే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అయిన రికార్డు హొరట్టిది. తప్పించాలని కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అదే జరిగితే రమేష్ కుమార్‌కు రెండేళ్ల తర్వాత కీలకమైన హోదా లభించే అవకాశం ఉంది.

గ్యారెంటీల అమలు కమిటీ చైర్మన్
రేవణ్ణ దాడి చేశారని ఫిర్యాదు

● ప్రాణాలు తీస్తానని బెదిరించారు..
● కాంగ్రెస్ మహిళా కార్యకర్త ఆరోపణలు

బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పథకాల అమలు కమిటీ చైర్మన్, సీఎం సిద్దరామయ్య ఆప్తుడు హెచ్‌ఎం రేవణ్ణ దాడి చేశారంటూ కాంగ్రెస్ మహిళా కార్యకర్త నందిని నాగరాజ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు నగరంలోని హైగ్రౌండ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఓ వీడియోను పోలీసులకు ఇచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి విషయం తెలిపి మీడియా ముందుకు వెళ్తానని ఆమె ఆరోపించినట్లు ఉంది. దాడి చేయడమే కాకుండా ప్రాణాలు తీస్తానని బెదరించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై రేవణ్ణ వివరణ ఇచ్చారు. సదరు మహిళ తనతో గొడవపడ్డారని, పదే పదే రాహుల్‌గాంధీ పేరు చెప్పేవారన్నారు. దాడి చేశానని, హత్య చేస్తానని బెదరించాననడంలో వాస్తవం లేదన్నారు. వీడియో చేస్తూ దూషిస్తుండగా మొబైల్ లాక్కున్నది వాస్తవమన్నారు. ఎవరూ ఆమెపై దాడి చేయలేదన్నారు. ఓ అధికారిని బదిలీ చేసేందుకు ఫోన్ పే ద్వారా లక్ష రూపాయలు పొందారని అటువంటి చర్యలు సరికాదని హెచ్చరించానన్నారు. అనవసర ఆరోపణలు చేసినందుకే బెదిరించాల్సి వచ్చిందన్నారు. తాను తప్పు చేసి ఉంటే పార్టీ ఎటువంటి చర్యలు తీసుకున్నా కట్టుబడతానన్నారు. రాహుల్‌గాంధీ పేరును తప్పుగా వాడుకుంటున్నారన్నారు.

దళితులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● సబ్‌ప్లాన్ అమలు కావడం లేదు ● నిధులను పక్క శాఖలకు మళ్లిస్తున్నారు ● ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి


పరిషత్‌లో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేస్తోందని పరిషత్‌లో ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీలకు బీజేపీ పాలనలో 75యూనిట్‌లు ఉచితంగా విద్యుత్ అందేదన్నారు. ప్రస్తుతం అందరికీ వర్తించినట్టే దళితులకు దక్కుతోందన్నారు. గ్యారెంటీలకోసం ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లను ఉపయోగిస్తున్నారన్నారు. శక్తి గ్యారెంటీ అందరికీ వర్తిస్తుందని, బస్సులో ప్రయాణించే వేళ ఎస్సీ, ఎస్టీ ఎవరని ప్రత్యేకంగా కోరుతారా..? అన్నారు. జనాభాను బట్టి గ్రాంట్లు మళ్లించడం సముచితం కాదన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారని, కానీ ప్రతిరోజూ ఎస్సీ, ఎస్టీలు ఎక్కడికి ప్రయాణిస్తారని ప్రశ్నించారు. గ్యారెంటీల అమలు కమిటీకి కాంగ్రెస్ కార్యకర్తలను నియమించారని ఇది ఒకరకంగా గొర్రెల కాపలాకు తోడేళ్లను ఉంచినట్టే అన్నారు. సబ్‌ప్లాన్ అమలు కావడం లేదన్నారు. పార్టీ కార్యకర్తలకు ప్రజా సొమ్ము దోచిపెట్టేందుకు కమిటీలు వేశారన్నారు. కేంద్రనుంచి నిధులు ప్రస్తావిస్తారని, కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమానంగా గ్రాంట్లు కేటాయిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రభుత్వం ద్వంద్వవైఖరి అవలంబిస్తోందన్నారు. అయితే ఛలవాది నారాయణస్వామి మాట్లాడే సందర్భంలో కాంగ్రెస్ లూటీకి పాల్పడుతోందని ఆరోపించిన మేరకు కాంగ్రెస్ సభ్యులు పుట్టణ్ణతోపాటు పలువురు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

4 పంట ఉత్పత్తులు యశ్వంతపుర నుంచి మార్పు

నగరంలోని యశ్వంతపుర మార్కెట్‌నుంచి 4 పంట ఉత్పత్తులను మార్పు చేయదలిచామని మార్కెటింగ్ శాఖ మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. ప్రశ్నోత్తరాల వేళ కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు అడిగిన ప్రశ్నకు ఉల్లి, వెల్లుల్లి, ఆలుగడ్డ, అల్లంను దాసనపుర సబ్ మార్కెట్‌కు మార్పు చేస్తామన్నారు. 67 ఎకరాలల విస్తీర్ణంలో దాసనపుర మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాగా ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబీకులకు రూ.5లక్షల పరిహారం ఇవ్వదలిచామని, ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా మండ్య కేహెచ్‌బీ కాలనీలో కొత్తగా కావేరి నీటిని వినియోగానికి రూ.350 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారని నగరాభివృద్ధిశాఖ మంత్రి భైరతి సురేశ్ తెలిపారు.

అర్హత కల్గిన రైతులందరికీ రుణాలు

అర్హత కల్గిన రైతులందరికీ రుణాలు ఇస్తామని సహకారశాఖ మంత్రి రాజణ్ణ తెలిపారు. పరిషత్‌లో సభ్యుడు ప్రతాప్‌సింహనాయక్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. 2023-24లో వడ్డీ రహిత రుణాలను రూ.5లక్షలకు పెంచామన్నారు. 2024-25లో ఫిబ్రవరి వరకు 13,689మంది రైతులకు 589 కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చామన్నారు. నబార్డు సంస్థ గ్రాంటులో 40శాతం కోత విధించిందన్నారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి శివానంద పాటిల్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.47 (బుధవారం సాయంత్రం)
సెహరీ : 5.12 (గురువారం ఉదయం)



సీసీఆర్‌సీ కార్డుల జారీ తీరిదీ..

సంవత్సరం	జారీ చేసిన కార్డుల సంఖ్య
2019 - 20	2160
2020 -21	831
2021 -22	2022
2022- 23	2149
2023-24	6960
2024-25	8382



కౌలు కష్టాలు

కొందరికే గుర్తింపు కార్డులు

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు కష్టాలు వర్ణనాతీతం. కౌలు కట్టుకుంటాడు. సేద్యం పనులన్నీ స్వంతంగా చేసుకుంటాడు. పంట దెబ్బతింటే పెట్టుబడి, ఆరుగాలం శ్రమ, కౌలు డబ్బు సర్వం నష్టపోతాడు. అలాంటి నిసలైన రైతుకు అడుగడుగునా అన్యాయం వాటిల్లుతోంది. కనీసం గుర్తింపు దక్కట్లేదు. ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేయకపోవడం శోచనీయం. అనంత కౌలు రైతును ఆదుకోవడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏటా కౌలు రైతులకు నిబంధనల పేరుతో పంటల సాగుదారుల హక్కు (సీసీఆర్‌సీ) కార్డుల జారీలో కొర్రీలు పెడుతున్నారు. అరకొరగా సీసీఆర్‌సీ కార్డులు అందుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి తగిన పథకాలు వర్తింపజేయడం లేదు. బ్యాంకులు సైతం రుణాలు అందించడంలో తీవ్ర అశ్రద్ధ చూపుతున్నాయి. జిల్లాలో 30వేల మందికిపైగా కౌలు రైతులున్నట్లు అధికార వర్గాల సమాచారం.

ఏటా అరకొరగానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో కార్డులు అందుకున్న వారిలో సగంమందికి మాత్రమే రైతు భరోసా డబ్బు జమ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సొమ్మును ఒక్క కౌలు రైతుకు కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం. సీసీఆర్‌సీ కార్డున్నా ప్రభుత్వ పథకాలు వర్తించకపోవడంతో బాధిత కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు భూమిలో పంటలు సాగు చేసి, పంట నష్టం వాటిల్లినా రైతులకు పరిహారం వర్తింపజేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచైనా అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, రైతు భరోసా, పీఎం కిసాన్, పంటనష్టపరిహారం, పంటల బీమా వర్తింపుతోపాటు బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీ
- 2024-25లో 68మందికే బ్యాంకు రుణాలు
- గత ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో ఇక్కట్లు
- రైతు భరోసా, ప్రభుత్వ పథకాల వర్తింపుపై నిర్లక్ష్యం
- వచ్చే ఖరీఫ్ నుంచైనా న్యాయం చేయాలని వేడుకోలు

నిబంధనలతో ఇక్కట్లు

గత వైసీపీ సర్కారు 2019లో పంటల సాగుదారుల హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టంలో భూమి యజమాని అంగీకారం ఉంటేనే కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్న నిబంధన పెట్టారు. తమ భూమి కౌలుకు తీసుకునే రైతులకు అంగీకారపత్రం రాసిస్తే తమకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్న కారణంతో భూమి యజమానులు సంతకం పెట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. అంగీకార పత్రం ఇడిగితే కౌలు రద్దు చేస్తామంటూ షరతులు పెట్టారు. దీంతో నిజమైన కౌలు రైతులకు అన్యాయం వాటిల్లుతోంది. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతుల రక్షణ కోసం ఏపీ భూ అధీకృత రైతుల చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం మేరకు భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను గుర్తించేది. సంబంధిత అధికారులు.. గ్రామసభలు ఏర్పాటు చేసి, అసలైన కౌలు రైతులను గుర్తించి, కార్డులు జారీ చేసేవారు. 2014-19 మధ్యకాలంలో కౌలు రైతులకు రుణ మాఫీని వర్తింపజేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు పాత చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టం మేరకు కౌలు రైతులకు గతంలో కంటే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని అప్పటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. భూయజమాని సంతకం తప్పనిసరి చేయడంతో కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాలో దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం లేదు. దీంతో పంట నష్టం వాటిల్లితే ఆయా కౌలు రైతులు ప్రభుత్వ లబ్ధికి దూరమవుతున్నారు. వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



అర్హులందరికీ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలి

జిల్లాలో కౌలు రైతులకు అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీతో అధికారులు సరిపెడుతున్నారు. ఇప్పటిదాకా 68 మందికి మాత్రమే బ్యాంకు రుణం ఇవ్వడం దారుణం. సీసీఆర్‌సీ కార్డులున్న రైతులకు బ్యాంకు రుణం ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచైనా అర్హత కలిగిన ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసి, బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రంగారెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

68 మందికే బ్యాంకు రుణం

2024-25 సంవత్సరంలో 8,382 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. వీరిలో 1,741 మందికి రుణ మంజూరుకు అర్హత ఉన్నట్లు ఎస్ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ) గుర్తించింది. 2024-25 ఖరీఫ్‌లో 68 మందికి రూ.39.55 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేయడంతో సరిపెట్టారు.



ఆ చట్టాన్ని రద్దు చేయాలి

భూయజమాని సంతకం ఉంటేనే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలంటూ వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. పాత పద్ధతిలోనే భూయజమాని సంతకం అవసరం లేకుండానే అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి, కౌలు రైతులను గుర్తించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కార్డులు జారీచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్, బ్యాంకు రుణాలు, పంటనష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలను వర్తింపజేయాలి. దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, ఆదుకోవాలి.

- బాలరంగయ్య, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి



రికవరీ..!

అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు

నోడ్యూస్ జారీ చేయని ఉన్నతాధికారులు

రిటైర్మెంట్ సమయంలో తిప్పలు

అటవీశాఖ జిల్లా కార్యాలయం



అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు బిగుసుకుంది. ఉద్యోగ విరమణ సమయంలో సమస్యలు తెచ్చిపెట్టింది. స్వాహా అయిన సొమ్ము రికవరీ అయ్యేవరకు నోడ్యూస్ జారీ చేయమని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

అక్రమాల పర్వం ఇలా..?

అటవీశాఖ జిల్లా కార్యాలయంలోని అనంతపురం రేంజ్ పరిధిలో గతంలో అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వారిని పట్టుకుని, జరిమానా వేసి, ఆ సొమ్ము చలానాల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేలా ఫైల్ రెడీ చేసి పంపారు. సొమ్ము కట్టించుకునే కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేసు వివిధ అకౌంట్లకు ఫోన్ పే ద్వారా సొమ్ము మళ్లించుకుని, నకిలీ చలానాలతో స్వాహా చేస్తూ వచ్చాడు. కార్యాలయంలోని సిబ్బందిని మామూళ్లతో మేనేజ్ చేశాడన్న ఆరోపణలున్నాయి. అలా 2019 నుంచి 2023 వరకు రూ.15 లక్షలుపైగా జేబులోకి వేసుకున్నాడు. ఆడిటింగ్‌లో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంకటేసుపై పోలీసులకు ఫిర్యాదు చేసి, జైలుకు పంపారు. గుత్తి, అనంతపురం రేంజ్‌లలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఆ సమయంలో గుత్తిరేంజ్ ఎఫ్ఎస్ఓగా కొనసాగి ప్రస్తుతం ముదిగుబ్బలో పనిచేస్తున్న ఐజాక్‌బాబు ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయనకు నోడ్యూస్ సర్టిఫికెట్ జారీ చేయకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో గుత్తి ఫారెస్ట బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన అయూబ్ బాషా పేరున కూడా మూడు నకిలీ చలానాలు వెలుగుచూశాయి. ఆయన చనిపోవడంతో కుటుంబీకులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశం కల్పించారు. అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి ప్రస్తుతం కుప్పం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్వో)గా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్ శ్రీనివాసులు జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇచ్చే అవకాశం లేదు. అప్పట్లో రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం డోన్ సబ్‌డీఎఫ్ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు. ఇప్పటికే సూపరింటెండెంట్ నుంచి రికవరీకి సంబంధించి సమాచారం అందినట్లు తెలిసింది.





డీఎఫ్ఓకి సమస్యలు చెప్పుకుంటున్న సిబ్బంది (ఫైల్)

త్వరగా సమస్య పరిష్కరిస్తాం

స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి తీరుతాం. అందులో భాగంగానే నోడ్యూస్ జారీ చేయకుండా పెండింగ్ పెడుతున్నాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

- విఘ్నేష్, జిల్లా అటవీ శాఖాధికారి

చాలీ చాలని జీతంతో నెట్టుకొస్తున్న వైనం ● నూతన ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరేనా?

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్యమిత్రల ఎదురుచూపు

చిన్న ఆశ

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్య మిత్రలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది దాకా ఆరోగ్యమిత్రలు ఉన్నారు. ప్రభుత్వాలు అరకొర జీతమే ఇస్తున్నా వీరు మాత్రం దండిగా ప్రజాసేవ చేస్తున్నారు. గత ప్రభుత్వ చర్యలతో వీరి ఉద్యోగ జీవితం దిన దిన గండంగా గడిచింది. - ఆంధ్రజ్యోతి, ధర్మవరం

ఆరోగ్య మిత్రలు ఏం చేస్తారంటే..

ప్రతిరోజు తమకు కేటాయించిన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తారు. చికిత్స కోసం వచ్చే రోగుల పేర్లను రిజిస్టర్ చేసి, వారిని సంబంధిత డాక్టర్ వద్దకు తీసుకెళతారు. పరీక్షల అనంతరం వారి వివరాలు రికార్డుల్లో పొందుపరిచి, ఏఏ మందులు ఎలా వాడాలి? ఇంటికి వెళ్లిన తరువాత ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతారు. రోగి ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యేవరకు బాధ్యతంతా ఆరోగ్యమిత్రదే.

ప్రక్షాళన పేరుతో ఇబ్బందులు



గత వైసీపీ ప్రభుత్వం ప్రక్షాళన పేరుతో ఆరోగ్యమిత్రలను తీవ్ర ఇబ్బంది పెట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రూ.13500లే జీతమిస్తూ వెట్టి చాకిరీ చేయించారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పొమ్మన లేక పొగ పెట్టింది. జిల్లాలో పని చేసే ఆరోగ్య మిత్రలందరినీ మరో జిల్లాకు బదిలీ చేసింది. వారిస్థానంలో సచివాలయ ఏఎన్ఎంలకు బాధ్యతలు అప్పగించాలని కుయుక్తులు పన్నారు. తమకు అన్యాయం జరుగుతోందని గొంతెత్తినా పట్టించుకునేవారు లేకుండాపోయారు. ఎన్నికలు రావడంతో ఆరోగ్యమిత్రలు ఊపిరిపీల్చుకున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశ

ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఆరోగ్య మిత్రలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ భద్రతతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తోంది. ఇటీవల ఆరోగ్య మిత్రలందరూ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ప్రధానంగా ఆరోగ్యమిత్రలను పర్మినెంట్ ఉద్యోగులుగా చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వా కోరారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ చాంబర్ (ఫైల్)

వసతిగృహాలకు రూ.1.73 కోట్ల బకాయి

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇబ్బందులు

సొంత డబ్బుతో కొనాల్సిందేనా..?

కాస్మెటిక్స్ కష్టాలు..!

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్స్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సకాలంలో కాస్మెటిక్స్ చార్జీలు అందక నానా అవస్థలు పడ్డారు. సంవత్సరానికిపైగా చార్జీలు అందక విద్యార్థులు సొంతఖర్చులతో కాస్మెటిక్స్ కొనుగోలు చేసి కాలం నెట్టుకొచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ కాస్మెటిక్ చార్జీలు అందించడంలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతగృహాలకు సంబంధించి సుమారు రూ. 1.73 కోట్లు కాస్మెటిక్ చార్జీలు విద్యార్థుల ఖాతాలకు జమ కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

ఎస్సీ కార్పొరేషన్



రూ. 1.73 కోట్లు బకాయి

అన్ని వసతి గృహాలకు సంబంధించి విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలు మొత్తం రూ.1.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతిగృహాలకు ఏడాదిగా కాస్మెటిక్స్ చార్జీలు అందడంలేదు. జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా... 8027 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికి దాదాపు 2024 నుంచి కాస్మెటిక్స్‌కు బడ్జెట్ కేటాయించలేదు. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు రూ. 87.72 లక్షలు నిధులురావాల్సి ఉంది. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు 2024 ఫిబ్రవరి నెల నుంచి కాస్మెటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ హాస్టళ్లల్లో విద్యార్థులకు రూ. 65.81 లక్షలు బకాయి ఉంది. ఎస్సీ సంక్షేమశాఖకు జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 5791 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి 2024 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్ చార్జీలు రావాలి. వీటికి సంబంధించి రూ.18 లక్షలు పెండింగ్‌లో పడిపోయాయి. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో ఐదు వసతిగృహాల్లో 200 మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి గత ఏడాది డిసెంబరు నుంచి రూ. 2.79 లక్షల కాస్మెటిక్ చార్జీలు రావాల్సి ఉంది.

బడ్జెట్ వచ్చింది



కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి రూ. 1.52 కోట్లు బడ్జెట్ వచ్చింది. గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ బడ్జెట్ వచ్చింది. త్వరలోనే విద్యార్థుల ఖాతాలకు నగదు జమ అవుతుంది.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

బిల్లులు జనరేట్ అయ్యాయి...



జిల్లాలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించిన గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బిల్లులు జనరేట్ అయ్యాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బడ్జెట్ త్వరలోనే రానుంది. బడ్జెట్ రాగానే విద్యార్థుల ఖాతాలకు కాస్మెటిక్ చార్జీలు జమ అవుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

బడ్జెట్ ఉంటే... టోకెన్లు రావు...

సంక్షేమ వసతిగృహాల్లో డైట్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీల పరిస్థితి అయోమయంగా తయారయింది. ఒక శాఖకు బడ్జెట్ వస్తే... టోకెన్ నంబర్లు రావు.. మరో శాఖకు టోకెన్ నంబర్లు వస్తే.. ట్రెజరీలో బిల్లులు పెండింగ్‌లో పడిపోతాయి.. మరోశాఖలో బడ్జెట్, టోకెన్ నంబర్లు, ట్రెజరీ తతంగమంతా ముగిసినా... ఆర్‌బీఐ నుంచి క్లియరెన్స్ రాదు... ఇలా సంక్షేమ వసతిగృహాలకు ఆర్థికపరమైన చిక్కులు వీడటం లేదు. ప్రస్తుతం కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి బీసీ సంక్షేమశాఖ పరిధిలో బడ్జెట్ వచ్చింది.. కానీ టోకెన్ నంబర్ల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌లో బడ్జెట్ రావడంతో పాటు... బిల్లులు జనరేట్ అయ్యాయి. కానీ క్లియరెన్స్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.

అందుబాటులో ఉచిత ఇసుక

పుట్టపర్తిటౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులందరికీ ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్నతో కలిసి మంగళవారం ఆయన డీఎల్ఎస్‌ఈ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇసుక డంపింగ్ యార్డులను ఆర్డీవోలు 15రోజులకు ఒకసారి పరిశీలించి, సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని డంపింగ్ యార్డుల్లో సీసీ కెమేరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. అక్రమ రవాణా జరగకుండా మండల స్థాయిలో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మైనింగ్, జలవనరులు, పర్యావరణా శాఖాధికారులున్నారు.

తప్పుల్లేకుండా ఆధార్ నమోదు

ఆధార్ నమోదులో తప్పులకు తావుండరాదని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కోర్టు హాల్ సమావేశ భవనంలో ఆధార్‌న మోదుపై జిల్లా కమిటీతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు వైద్యాఆరోగ్యం, ఐసీడీఎస్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధార్ నమోదు కేంద్రాల్లో చేయాలన్నారు. జన్మించిన శిశువులకు ఆధార్ నమోదుకు పుట్టిన తేదీని తప్పనిసరి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా 54,013మంది ఐదేళ్లలోపు పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఆధార్ నమోదు కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డిఇఓ క్రిష్టప్ప, ఐసిడిఎస్ అధికారులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ జేసీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డీకే పట్టమ్మాళ్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, పద్మవిభూషణ్ గ్రహీత డామల్ కృష్ణస్వామి పట్టమ్మాళ్ 1919 మార్చి 19న తమిళనాడు రాష్ట్రం కంచీపురంలో జన్మించారు. నేపథ్యగాయనిగా అనేక భారతీయ భాషా చలనచిత్రాలలో పాడారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, ఎంఎల్ వసంతకుమారి ఆమెకు సమకాలీనులు. వీరు కర్ణాటక గాత్రసంగీతంలో స్త్రీరత్న త్రయంగా సుప్రసిద్ధులు. కచేరీలో ఆమె ప్రతిభను గుర్తించి పాపనాశనం శివన్ సంగీతం నేర్పించి ప్రోత్సహించారు. గాన సరస్వతి, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2019 జులై 16న కన్నుమూశారు.

నాగభూషణం (జయంతి)



'రక్తకన్నీరు' నాగభూషణం 1921 మార్చి 19న ప్రకాశం జిల్లా అనకర్లపూడి గ్రామంలో జన్మించారు. రంగస్థల, తెలుగు సినిమా నటుడు. విలనిజానికి ఒక ప్రత్యేక పంథాను ప్రవేశపెట్టి, కామెడీ టచ్ ఇచ్చిన నటుడు ఆయన. విలన్ చెప్పే డైలాగ్ లకు కూడా క్లాప్స్ కొట్టించిన ఘనుడు ఆయన. 1962లో 'మంచి మనసులు' సినిమాతో గుర్తింపు పొంది రెండు దశాబ్దాలపాటు ఉజ్వలంగా ప్రకాశించారు. ఉద్యోగ జీవితంలోనూ, నట జీవితంలోనూ నాటకరంగాన్ని విడిచిపెట్టలేదు. ఆయన సృష్టించిన ఒరవడి రావు గోపాలరావు, నూతన్‌ప్రసాద్, కోట శ్రీనివాసరావు ద్వారా కొనసాగింది. తమిళ నాటకాన్ని తెలుగులో 'రక్తకన్నీరు' పేరుతో రాయించి దేశవ్యాప్తంగా సుమారు 2వేల ప్రదర్శనలు ఇచ్చారు. 25ఏళ్లపాటు 300మంది కళాకారులకు అన్నం పెట్టింది. ఎన్నో గౌరవాలు సత్కారాలు అందుకున్నారు. 1995 మే 5న కన్నుమూశారు.

ఫిలిప్ రోత్ (జయంతి)



ఫిలిప్ మిల్టన్ రోత్ 1933 మార్చి 19న న్యూయార్క్‌లో జన్మించారు. అమెరికన్ రైటర్స్‌లో ఎక్కువ పురస్కారాలు అందుకున్న వ్యక్తి. నొవెల్లా గుడ్‌బై, కొలంబస్, ది హ్యూమన్ స్టెయిన్, అమెరికన్ పెస్టోరల్ తదితర రచనలు ఎంతో పేరొందాయి. ఆయన నవలలు, కథలు కొన్ని సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి. పులిట్జర్ పురస్కారం, నేషనల్ బుక్ అవార్డ్, నేషనల్ బుక్ క్రిటిక్స్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2018 మే 22న కన్నుమూశారు.

మోహన్‌బాబు (పుట్టినరోజు)



డైలాగ్‌కింగ్, కలెక్షన్‌కింగ్ పేరొందిన మోహన్‌బాబు 1952 మార్చి 19న చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం మోదుగులపాళెంలో జన్మించారు. అసలు పేరు మంచు భక్తవత్సలం నాయుడు. సినిమా నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు, 570కుపైగా సినిమాల్లో నటించారు. 72 సినిమాలు నిర్మించారు. రాజ్యసభ సభ్యుడిగా వ్యవ హరించారు. అనేక హిట్ చిత్రాలో నటించి నిర్మాత గాను ఉన్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్య క్షుడిగా వ్యవహరించారు. విద్యానికేతన్ విద్యాసంస్థను స్థాపించారు. కళలు, విద్యారంగంలో సేవలకు 2007 లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. కళాప్రపూర్ణ, నవరస నటరత్నం తదితర అవార్డులు అందుకున్నారు.

బాబుమోహన్ (పుట్టినరోజు)



తెలుగు సినిమా నటుడు బాబు మోహన్ 1952 మార్చి 19న ఖమ్మం జిల్లా బీరోలులో జన్మించారు. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి. రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ సినిమాలపై ఆసక్తితో రాజీనామా చేశారు. తొలి సినిమా 'ఈ ప్రశ్నకు బదులేది'. తర్వాత 'మామగారు' సినిమాలో యాచకుడి పాత్రలో ఉత్తమ నటనకు నంది అవార్డు అందుకున్నారు. రాజేంద్రుడు గజేంద్రుడు, పెదరాయుడు, జంబలకిడిపంబ వంటి సినిమాల్లో మంచి హాస్యపాత్రలో నటించారు. 'మాయలోడు' సినిమాతో స్టార్ కమెడియన్ అయ్యారు.

అభివృద్ధి పనులకు మహానగర పాలికె ఆమోదం



మొక్కకు నీరుపోసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు

రాయచూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాయచూరు మహానగర పాలిక తొలి సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. నగరంలో రూ.200 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు సభ్యులు అభివృద్ధి పనులకు సంబంధించి చేపట్టే ప్రణాళికలో ప్రజాప్రతినిధులందరిని మరింత భాగస్వామ్యం చేసి ఉండాల్సిందన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న మహానగర పాలిక ప్రత్యేక అధికారి ఇది కేవలం ముసాయిదా ప్రతిపాదన మాత్రమేనన్నారు. నగరంలోని అన్ని వార్డులతో పాటు ప్రధానమైన అభివృద్ధి పనులను ఇందులో ప్రస్తావించినట్లు తెలిపారు. మామిడి చెరువు అభివృద్ధి రోడ్ల విస్తరణ, అభివృద్ధి, స్వచ్ఛత, తాగునీరు వంటి వివిధ అభివృద్ధి పనులు ముసాయిదాలో సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇది కేవలం ముసాయిద ప్రతిపాదన మాత్రమేననా మహానగర పాలిక ఆమోదం అనంతరం రాష్ట్ర ఆర్థిక శాఖకు పంపాల్సి ఉంటుందని అక్కడ ఆమోదం అనంతరం కేంద్రం నుంచి మంజూరు లభించాల్సి ఉంటుందన్నారు. మహాత్మగాంధి, నగర వికాస్ పథకం ద్వార చేపట్టే ఈ పనులు మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సారి ఎక్కడ అభివృద్ధి కావాలనుకున్న అన్ని వార్డులను అందులో చేర్చే అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా కోటగల్ నృసింహుడి రథోత్సవం

చింతామణి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అంబాజిదుర్గ హోబళి కోటగల్ గ్రామపంచాయతీ పరిధిలోని కె.రాగుట్టహళ్ళి మజరా శింగరేపల్లిలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామస్థులు పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. తొలుత ఆలయంలో వివిధ హోమాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చారు. తాలూకా పాలకమండలి ఉత్సవాన్ని ప్రారంభించారు. వివిధ కళాబృందాలు, మేళతాళాల నడుమ రథోత్సవం సాగింది. భక్తులు రథంపై దవనం, అరటిపండు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సమితి ఆధ్వర్యంలోనూ గ్రామస్థులచేత అన్నసంతర్పణ సాగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు భక్తులకు ట్రాక్టర్‌లలో పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు వెయ్యికిపైగా ఎడ్లబండ్లు రావడంతో జాతర సందడి నెలకొంది. పిల్లల ఆట సామగ్రి, వివిధ రకాల తినుబండారాల దుకాణాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో తహశీల్దార్ సుదర్శన్ యాదవ్, అంబాజిదుర్గ హోబళి ఉపతహశీల్దార్ మోహన్ కుమార్, శోభా, గ్రామపంచాయతీ ముఖ్యులు వెంకటరెడ్డి, వెంకటశామిరెడ్డి,



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ నరసింహమూర్తి, గ్రామ ప్రముఖులు ప్రదీప్‌స్వామి, శ్రీరామప్ప, ప్రసన్నకుమార్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. ఆంజనేయస్వామి



ఆంజనేయస్వామి మూలవిరాట్టు

చేళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా పరిధిలో బాగేపల్లికి వెళ్లే మార్గంలో సోమనాథపుర గ్రామపంచాయతీ కేంద్రంలో కొలువైన ఆంజనేయస్వామి భక్తుల కొంగు బంగారంగా ఉన్నారు. 1954 సెప్టెంబరు 4న పెద్ద పకీరప్ప నేతృత్వంలో ఆలయానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడి ఆలయంలో ప్రతి మంగళ, శనివారాలలో విశేషపూజలు కొనసాగుతాయి. కాలక్రమంలో భక్తుల తాకిడి పెరగడంతో దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. పాతపాళ్యకు చెందిన వెంకట నారాయణశెట్టికి మగసంతానం కలగడంతో ఆంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుత ఆలయ పూజారి భైరప్ప మాట్లాడుతూ తమ తాత ముత్తాతలనుంచి అర్చకవృత్తిలో ఉన్నారన్నారు. ప్రతి శనివారం స్వామివారికి విశేషంగా పూజలు కొనసాగుతాయని ఈ సందర్భంగా స్వామి కుడివైపు నుంచి పువ్వు కింద పడితే ఎలాంటి అడ్డంకులు లేకుండా పని జరుగుతుందనేది భక్తుల విశ్వాసంగా ఉందన్నారు. అదే పువ్వు ఎడమవైపు నుంచి పడితే సదరు పని ఆలస్యం అవుతుందని భావిస్తారన్నారు. గతంలో ఈ ప్రాంతంలో బంగారు నాణేలు దొరుకుతుండేవన్నారు. సోమనాథపురం గ్రామానికి తూర్పున ఆంజనేయస్వామి, పడమర దిక్కున శివాలయం ఉన్నాయి. సమస్యలతో సతమతమవుతున్నవారు స్వామివారిని దర్శించుకుంటే త్వరలోనే పరిష్కారం అవుతాయని భక్తులు విశ్వసిస్తారన్నారు.

జయమహల్ రోడ్డుకు పొంచివున్న ప్రమాదం



దెబ్బతిన్న గోడ ఇలా...

నిత్యం వేలాది వాహనాలు సంచరించడమే కాదు ఏకంగా ఆరేడుగురు మంత్రులు క్వార్టర్స్ కలిగిన జయమహల్ మెయిన్‌రోడ్‌లో ప్రమాదం పొంచి ఉంది. కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌కు సమీపం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్ళే ప్రధానమైన రోడ్డుకు అనుబంధంగా ప్యాలెస్ మైదానం ఉన్న విషయం తెలిసిందే. ఇలా జయమహల్ నుంచి దూరదర్శన్ ఎదురుగా ఉండే ఫన్ వరల్డ్‌ల మధ్యన రెండు విలాసవంతమైన ఫంక్షన్‌హాళ్ళు ఉన్నాయి. ఇదే ప్రాంతంలోనే మెయిన్‌రోడ్‌కు ప్యాలెస్ మైదానంకు సుమారు 15 అడుగులకు పైగా రాళ్ళతో దశాబ్దాల కిందట ప్రహరీ నిర్మించారు. ఇటీవల కొన్నేళ్ళుగా పర్యవేక్షణ లేకుండా కాంపౌండ్ వాల్ కూలేస్థితికి చేరింది. అప్పుడే కొంతభాగం కూలిపోగా మరికొంత రోడ్డువైపుకు వాలిపోయింది. ఇలా భారీగా ఉండే ప్రహరీ ఎప్పుడు కూలిపోనుందో అనే భయం వాహనదారులను వెంటాడుతోంది. ప్రమాదం జరిగాక తీసుకునే సహాయక చర్యలు కాకుండా ముందుగానే కనీసమైన మరమ్మత్తులు చేపడితే సమంజసమనిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు



గోడ అడుగుభాగం ఇలా...

22నుంచి దక్షిణ ఆసియా శాంతి సమ్మేళనం

బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రోటరీ డిస్ట్రిక్ట్ 3192 ఆధ్వర్యంలో దక్షిణ ఆసియా అంతర్జాతీయ శాంతి సమ్మేళనం ఈనెల 22నుంచి జరగనున్నట్టు డిస్ట్రిక్ట్ గవర్నర్ మహదేవప్రసాద్, కార్యదర్శి శంకర్ శ్రీనివాస్‌లు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్‌లు ముఖ్యులుగా పాల్గొంటారని, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, కేంద్రమంత్రి కుమారస్వామితోపాటు పలువురు రాష్ట్రమంత్రులు భాగస్వామ్యులు అవుతారని తెలిపారు. రెండురోజులపాటు సదస్సు కొనసాగుతుందని భూటాన్, నేపాల్, శ్రీలంక, భారత సంప్రదాయ నృత్యాలు కొనసాగుతాయన్నారు. సుమనహళ్ళిలోని సెంట్రల్ రిలీఫ్ కమిటీ డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్‌భవన్‌లో సమ్మేళనం ఉంటుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నిర్వాహకుడు మహదేవప్రసాద్

కుల వర్గీకరణ అమలులో వెనకడుగు



మీడియాతో ఉదయ్‌కుమార్ తదితరులు

దొమ్మసంద్ర, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలకు కులవర్గీకరణ అమలు చేసేందుకు సుప్రీకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయడానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెనుకడుగు వేస్తున్నారని ఆనేకల్ తాలూకా మాదిగ సంఘం ఆరోపించింది. సంఘం ముఖ్యుడు ఎ ఉదయ్‌కుమార్ ఇతర పదాధికారులతో కలసి మంగళవారం మీడియాతో మాట్లాడారు. కుల వర్గీకరణకోసం 30ఏళ్ల పోరాటం జరగడంతో కోర్టులు స్పందించి సానుకూలంగా స్పందించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఉన్నప్పటిక అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా దళితుల సమస్యలపై సానుకూలంగా స్పందించలేదని ఆరోపించారు. బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాలలో మంత్రి మహదేవప్ప ప్రసంగిస్తూ మూడు నెలల్లో కులవర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీల అమలు చేయాలని కోరుతూ ఈనెల 21న సర్జాపుర పట్టణం నుంచి బెంగళూరు ఫ్రీడంపార్కులో భారీ సమావేశం నిర్వహిస్తామన్నారు. మీడియా సమావేశంలో అత్తిబెలె పురసభ మాజీ సభ్యుడు పి నారాయణస్వామి, నెరిగ నరసింహయ్య, వి శివణ్ణ, డాక్టర్ సులోచనా, చిన్ను రామస్వామి, సర్జాపుర సతీశ్, గోపాల్ తదితరులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సేవాభావం పెంపొందించుకోవాలి

శిడ్లఘట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా సేవా మనోభావం పెంపొందించుకోవాలని చిక్కబళ్ళాపుర జిల్లా సంస్థ కార్యదర్శి సి.బి. ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు రాజ్‌భవన్ గ్లాస్‌హౌస్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో 2023-24 వార్షిక పురస్కారాలు ప్రదానం చేశారు. జిల్లా నుంచి 20మంది విద్యార్థులు ఎంపిక కాగా తాలూకానుంచి 8మంది ఎంపికయ్యారు. జంగమకోటె ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి దుశ్యంతశ్ కేఎస్, బీజీఎస్ హనుమంతపుర స్కూల్‌కు చెందిన పి అధ్యాగౌడ, గౌరిబిదనూరు తాలూకాలోని మేళ్య ప్రభుత్వ హైస్కూల్ గైడ్ ప్రవలికలకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పురస్కారాలు అందచేశారు. ఇతర విద్యార్థులకు జిల్లాస్థాయి అధికారులచే ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు.



రాజ్‌భవన్ గ్లాస్‌హౌస్‌లో తాలూకా స్కౌట్ విద్యార్థులు

కూరగాయల మార్కెట్ తరలింపు సరికాదు

● వ్యాపారుల సంఘం కార్యదర్శి మహ్మద్ వసీం

రాయచూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈరణ్ణ సర్కిల్ నుంచి రేడియో స్టేషన్ వైపు వెళ్లె రోడ్డులో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను తరలించాలని మహానగర పాలికలో తీర్మానించడం సరికాదని వ్యాపారులు రైతుల సంక్షేమ సంఘం కార్యదర్శి మహ్మద్ వసీం అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత కరోనా సమయంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఉస్మానియ మార్కెట్‌ను వివిధ ప్రాంతాలకు వర్గీకరించడం జరిగిందన్నారు. అటు రైతులకు ఇటు వ్యాపారులకు వినియోగదారులకు అనుకూలంగా ఉండే రీతిలో ఇక్కడ కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వ్యాపారులు వినియోగదారులతో పాటు రైతులు సహితం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడున్న మార్కెట్‌ను తిరిగి ఉస్మానియ కూరగాయల మార్కెట్‌కు తరలించాలని చేసిన తీర్మానం వల్ల అన్ని వర్గాల వారికి ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికే ఉస్మానియ కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాల కొరత ఉండడం పార్కింగ్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి సంబంధించి వ్యాపారులు అటు జిల్లాధికారికి ఇటు నగర పాలికకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మహా నగర పాలిక తీసుకున్న అన్ని నిర్ణయాలను తాము స్వాగతిస్తామని వారు నిర్దేశించిన అంచల మేరకే వ్యాపార వ్యవహారాలు నిర్వహిస్తామని మార్కెట్ తరలింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న వ్యాపారుల సంఘం కార్యదర్శి మహ్మద్ వసీం

ఆవని హుండీ ఆదాయం రూ.8.35 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

ముళబాగిలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆవణి గ్రామంలో ప్రముఖ శ్రీరామలింగేశ్వర దేవస్థాన హుండీ ఆదాయం రూ.8.35 లక్షలుగా ఉంది. ఆలయ హుండీ ఆదాయాన్ని ఏడాదికోసారి లెక్కిస్తారు. ఇటీవల రథోత్సవం ముగియడంతో సోమవారం ఆదాయాన్ని లెక్కించారు. ఈ సంద ర్భంగా ఉప తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్ఐ బి సుబ్రమణి, జడ్పీ మాజీ సభ్యుడు ఆవణి కృష్ణప్ప, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీప్రియ, దేవదాయశాఖ అధికారి కేవీ సుబ్రమణ్యం పాల్గొన్నారు. హుండీ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు అధికారులు తెలిపారు.

సమాజ సేవతోనే సార్థకత



కిట్‌లు పంపిణీ చేస్తున్న రాజేశ్ తదితరులు

మహదేవపుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమాజసేవతోనే సార్థకత సాధ్యమని బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్ అభిప్రాయపడ్డారు. పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలు సామాజిక సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆడంబరాలకు కాకుండా సమాజ సేవ ద్వారా అర్థవంతంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని మాజీ మంత్రి అరవింద లింబావళి సూచించారని ఆమేరకు కొనసాగుతున్నట్టు తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే కొనసాగుతున్నామన్నారు. వైట్‌ఫీల్డ్, అంబేద్కర్ గుట్టలోని దసరా మైదానంలో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఇదే సందర్భంగా పేద లకు నిత్యావసర కిట్‌లు, మహిళలకు వాయనం అందచేశారు. ఆటో డ్రైవర్‌లకు యూనిఫాం, అనాథ ఆశ్రమంలోని పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేంద్రమోది, గుట్టి మారప్ప, వెంకటేశ్‌రెడ్డి, నవీన్‌చౌదరి, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఏథర్‌తో సేల్స్‌ఫోర్స్ ఒప్పందం

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాల మార్కెటింగ్‌లో రాణిస్తున్న ఎథర్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ, సేల్స్‌ఫోర్స్‌తో కలసి ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు ఏథెర్ సీఈఓ రవనీత్ ఎస్ ఫోకేలా మాట్లాడుతూ డీలర్‌ల నిర్వహణా వ్యవస్థను పెంచడంతోపాటు వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సేల్స్‌ఫోర్స్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. కొత్త డీలర్‌ల నిర్వహణా వ్యవస్థ, ఏథెర్ డీలర్ సెంట్రల్ పేరిట వ్యవహారాలు కొనసాగిస్తామన్నారు. సేల్స్‌ఫోర్స్ ఇండియా ఫైనాన్స్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ మణికిరణ్ చౌహాన్ మాట్లాడుతూ దేశంలో ఈవీ మార్కెటింగ్ పెరుగుతోందని అందుకు అనుగుణంగా సేల్స్‌ఫోర్స్ ప్లాట్‌ఫాంలో అభివృద్ధి చేయదలిచామన్నారు.

సినిమా విజయవంతంపై హర్షం


బొమ్మనహళ్ళి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కన్నడ సినిమా 'భావతీరయాన' సినిమా విజయవంతంగా సాగుతోందని నిర్మాత లక్ష్మణ్ టీకే తెలిపారు. హొంగసంద్రలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోజురోజుకు ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందుతోందన్నారు. 25 రోజులు గడిచిందన్నారు. ఫ్యామిలీ సినిమాగా గుర్తింపు పొంది నగరంలోని అన్ని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శించబడుతోందన్నారు. రమేశ్‌భట్, విద్యామూర్తి, తేజస్ కిరణ్, ఆరోహినయన, అనుషా కృష్ణ సందీప్‌లు ప్రధానపాత్రలలో పోషించారన్నారు. మయూర్ అంబేకల్లు, తేజస్ కిరణ్ లు ఇద్దరూ దర్శకత్వం వహించగా సంగీతాన్ని మయూర్ అంబేకల్లు అందించారన్నారు. ప్రతి కన్నడిగుడు సినిమాను చూడాలన్నారు.

ద్విముఖ గణపతికి విశేష పూజలు



అలంకరణలో ద్విముఖ గణపతి

శిడ్లఘట్ట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకష్టచతుర్థి నేపథ్యంలో సోమవారం రాత్రి విశేషపూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృ తాభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. సాయంత్రం ధూపదీప నైవే ద్యాలు ప్రత్యేక పూజలు కొనసాగాయి. పండిత్ కృష్ణమూర్తి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.00	1,582.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,911	1.692
నీటి నిల్వ (టీఎంసీలు)	20.26	5.93

ఎమ్మెల్యే కార్యాలయానికి బాంబు బెదిరింపు

- అప్రమత్తమైన పోలీసులు
- ఉత్తుత్తి మెసేజ్‌గా నిర్ధారణ
- పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు సంతోష్



సీఐ రవిచంద్ర

బళ్లారి మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కార్యాలయంలో బాంబు పెట్టామని బెదిరింపుతో మంగళవారం పోలీసులు పరుగులు తీశారు. సీఐ రవిచంద్ర తెలిపిన వివరాల మేరకు బళ్లారి నగరంలోని రూపనగుడి ప్రాంతానికి చెందిన సంతోష్ అనే యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే భరత్ రెడ్డి శాసనసభ సమావేశాల్లో బెంగళూరులో ఉన్నారు. ఎమ్మెల్యే మొబైల్ ఫోన్‌కు సంతోష్ అనే వ్యక్తి ఫోన్‌నుంచి సోమవారం అర్ధ రాత్రి దాటిన తరువాత ఎస్ఎంఎస్ పంపించారు. మీ ఆఫీసుని బాంబుతో పేల్చేస్తామని, అక్కడ బాంబు పెట్టామని మెసేజ్‌లో ఉంది. ఎమ్మెల్యే సమాచారాన్ని గాంధీనగర్ పోలీసులకు చేరవేశారు. ఎమ్మెల్యే కార్యాలయాన్ని బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి బాంబు లేదు. ఉత్తుత్తి బెదిరింపులుగా తేలింది. సంతోష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా డిగ్రీ చదివి ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నానని, మానసిక వేదనకు గురై అలా బెదిరించానని పేర్కొన్నాడు. సంతోష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడికి గాయాలు



గాయపడిన భాస్కర్ నాయక్

బళ్లారి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడు భాస్కర్ నాయక్ గాయపడ్డారు. అనంతపురం జిల్లా డి. హీరేహాళ్ నుంచి బళ్లారికి బైక్‌పై వస్తున్న ఆయన బళ్లారి సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో కింద పడి గాయపడ్డారు. భాస్కర్ నాయక్ డి. హీరేహాళ్ మండలంలో ఓ పత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. బళ్లారిలో నివాసం ఉంటున్న ఆయన.. విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనం ముందు టైరు పేలిపోవడంతో బోల్తా పడింది. తీవ్ర గాయాలకు గురైన భాస్కర్‌ను చికిత్స నిమిత్తం బళ్లారి ఆస్పత్రికి తరలించారు.

మేకెదాటు ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

- అధికారంలోకి రాగానే హామీ మరచిన డీసీఎం డీకే శివకుమార్
- 21న విధానసౌధకు పాదయాత్ర: కరవే



మాట్లాడుతున్న రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు దురుగప్ప

బళ్లారి సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు పట్టణ,గ్రామీణ, రామనగర్, చిక్కబళ్లాపూర్, దొడ్డబళ్లాపూర్, దేవనహళ్లి ప్రాంతాలకు తాగునీరు అందించే మేకెదాటు ప్రాజెక్టును నిర్మించాలని కరవే డిమాండ్ చేసింది. ప్రవీణ్ శెట్టి వర్గానికి చెందిన కర్ణాటక రక్షణ వేదిక రామనగర్ నుంయి విదాన సౌధ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నటు కరవే జిల్లా అధ్యక్షుడు వి.హెచ్.దురుగప్ప తెలిపారు. మంగళవారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దురుగప్ప, రాష్ట్ర కన్వీనర్ అద్దగేరి రామన్న మాట్లాడుతూ మార్చి 21, 22 తేదీల్లో పాదయాత్ర చేపడ్తామన్నారు. 21వ తేదిన రామనగర్‌లోని కెంపెగౌడ సర్కిల్ నుంచి ప్రారంభమై బెంగళూరులోని విధానసౌద వరకు 58కి.మీ.ల దూరం పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఎన్నికలకు ముందు ఉప ముఖ్యమంత్రి డి.కే.శివకుమార్ పాదయాత్ర చేపట్టారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ప్రాజెక్టుపై అడుగు పడలేదన్నారు. మేకదాటు ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. బళ్లారి నుంచి 500 మంది పాదయాత్రలో పాల్గొంటారని, మొత్తం 10వేల మంది వరకు పాల్గొంటారన్నారు. విలేకరుల సమావేశంలో వి.వెంకటేశ్, శివన్న,చంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు వీరారెడ్డి, కే.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధానమంత్రి, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, భారతరత్న అంబేడ్కర్ జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు.డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని జిల్లాపంచాయతీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏప్రిల్ 5న మాజీ ఉప ప్రధానమంత్రి హరిత విప్లవ పితామహుడు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని, ఏప్రిల్ 14న భారత రత్న అంబేడ్కర్ 134వ జయంతిని ఘంగా జరపుకోవడానికి అవసరమైన అన్ని సన్నాహాలు చేయాలని జిల్లా పరిపాలన , సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గత రెండు సంవత్సరాలుగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ వ్యక్తుల పుట్టినరోజు వేడుకలను సరలంగా జరుపుకున్నారు ఈసారి ఈసందర్భాన్ని ఘనంగా జరుపుకోవడానికి వివిధ విభాగాల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఆయా కమిటీలకు అప్పగించిన పనులను చక్కగా నిర్వహించాలని, జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివిధ రంగాల్లో సాధించిన వారిని అభినందించడానికి వేదిక కార్యక్రమంలో సత్కార కార్యక్రమం నిర్వహించాలి. జయంతి కార్యక్రమాల సమయంలో జరిగే ఊరేగింపులో వివిధ శాఖల సహకారంతో రూపొందించాలని అధికారులను ఆదేశించారు. లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ముండ్రగి నాగరాజు మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ సిద్దాంతాలను పెంపొందించడం ద్వారా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ఈసందర్భంగా జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి, జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారిస్ సుమైర్ ,షెడ్యూల్డ్ కులాల అధికారి దివాకర్, విజయ్‌కుమార్, ఆహార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా,ప్రజా పనుల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

చోరీ అయిన ఫోన్ల అందజేత

బళ్లారి రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టెక్కలకోట పోలీస్‌స్టేషన్లో రికవరీ చేసిన ఫోన్లను ఎస్ఐ తారాబాయి యజమానులకు అందజేశారు. మంగళవారం మొబైల్ ఫోన్లు అందజేసిన ఎస్ మాట్లాడుతూ ఎవరైనా సెల్ ఫోన్లు చోరీకి గురయితే వెంటనే పోలీస్ స్టేషన్లో తెలియజేయాలన్నారు.



ఫోన్లు అందజేస్తున్న ఎస్ఐ తారాబాయి

సామాజిక సేవకు విశ్వవ్యాప్త గుర్తింపు

- వీఎస్కేయూ వీసీ మునిరాజు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ మునిరాజు

బళ్లారి సిటీ,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మానవ సంక్షేమానికి దోహదపడే సామాజిక సేవకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని, సామాజిక సేవ ప్రశంసనీయమని విజయనగరం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఎం. మునిరాజ్ అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవ వేడుకలకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సామాజిక న్యాయం, మానవ హక్కులను పరిరక్షించడం, దోపిడీకి గురైన మహిళలు, పిల్లలు, వృద్ధులు, అనాథలు, బలహీనులను చేరదీయడంతో సామాజిక కార్యకర్తల కృషి ఘననీయమైనదన్నారు. 1983 నుంచి అంతర్జాతీయ సామాజిక కార్యకర్తల సమాఖ్య ప్రపంచ సామాజిక కార్యదినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మార్చి నెలలోని మూడవ మంగళావారం నాడు ప్రపంచ సామాజిక కార్యదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. రిజిస్ట్రార్ రుద్రేశ్ మాట్లాడుతూ బుద్ధుడు, బసవ, అంబేడ్కర్, గోపాల గౌడ తత్వాలు నేటి విద్యార్థి సామాజిక కార్యకర్తలకు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాలి, ప్రొ. గౌరీ మాణికమానస్, రష్మిరాణి, కుమార్, సోషల్ వర్క్ విభాగం లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాదిరాజ ఆరాధనోత్సవాలు



వాదిరాజ స్వాముల ఊరేగింపులో భక్తులు

సిరుగుప్ప, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వాదిరాజ ఆరాధనా మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన వాదిరాజ ఆలయంలో బ్రాహ్మణులు ఆరాధనా మహోత్సవాలు నిర్వహించారు. వాదిరాజ భావ చిత్రపటంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆయన తత్వసిద్ధాంతాలను పాటించాలని బ్రాహ్మణులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాదిరాజ భక్తులు బ్రాహ్మణులు, ప్రజలు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మండలి అధ్యక్షుడు అశ్విన్ కొత్తంబరి

22న మెగా ఉద్యోగ మేళా

- హాజరుకానున్న 60 కంపెనీల ప్రతినిధులు

బళ్లారి సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హొసపేటలోని విజయనగర్ కళాశాల ఆవరణలో 22వ తేది ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మెగా ఉద్యోగ మేళా జరగనుంది. 60కి పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటాయని విజయనగర్ జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు అశ్విన్ కొత్తంబరి తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్, విజయనగర కళాశాల, రైట్‌వే సొల్యూషన్స్ కలిసి జాబ్ మేళాను నిర్వహించడం ఇదే మొదటిసారి అని అన్నారు. భవిష్యత్తులో ప్రతి సంవత్సరం ఉద్యోగమేళా నిర్వహిస్తామన్నారు.

అవిభక్త బళ్లారి జిల్లా నుంచి ఇప్పటికే మూడు వేలకు పైగా యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆయన అన్నారు. 2021 విద్యాసంవత్సరం, ఆ తర్వాతి వయస్సుగల యువత, అలాగే ఈ సంవత్సరం చివరి సంవత్సరం గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనవచ్చు. ఐటీఐ. డిప్లమా, ఇంజనీరింగ్, ఆర్ట్స్, కామర్స్ మొదలైన అన్ని డిగ్రీలు, డిప్లమాలు పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చు. స్థానిక యువతకు స్థానిక కంపెనీలు, ఇతర కంపెనీలలో ఉపాది అవకాశాలు కల్పించడమే లక్ష్యమని అన్నారు. జాబ్ మేళా కోసం విద్యార్థుల హెల్ప్‌లైన్ నంబర్లు 7353021292, 7204793140, కంపెనీ హెల్ప్‌లైన్ 7975278783 అని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కాకుబాలు రాజేంద్ర, విఎస్ కళాశాల అధ్యక్షుడు మల్లికార్జున, ఉద్యోగమేళా అధ్యక్షుడు మంజునాథ్, కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభుగౌడ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందించిన కేపీసీఎల్ సిబ్బంది

కంప్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరానికి పదవ తరగతి చదువుతున్న 95 మంది విద్యార్థులకు దాతలు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. గెనికేహాళ్, శరణమ్మ, దొడ్డయ్యస్వామి ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెట్రి గ్రామ పంచాయతీ సభ్యులు కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చదువుతున్న పేద కుటుంబాల విద్యార్థులకు సహకరించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. అదే మాదిరిగానే ఈ యేడాది కూడా కేపీసీఎల్ సిబ్బంది సురేష్ విద్యా ప్రేమికుడు మౌనేష్ ముందుకొచ్చి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు గిరీషా, ఎస్డీఎంసీ అధ్యక్షులు జగదీష్, లోకమ్మ, ప్రధానోపాధ్యాయులు వీఆర్ మూర్తి, నిర్మల, ప్రధానోపాధ్యాయులు చౌడప్ప, చంద్రప్ప, మడివాళప్ప పాల్గొన్నారు.

దరోజీ కొండపై మంటలు



దరోజీ కొండపై చెలరేగుతున్న మంటలు

కంప్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అతిపెద్ద కొండైన దరోజీ కొండపై సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ కొండలో 400లకు పైగా ఎలుగు బంట్లు, వివిధ రకాల జంతువులు, పక్షులు నివసిస్తున్నాయి. ప్రమాదవశాత్తు మంటలు రేగడంతో పలు వృక్షాలు కాలి బూడిదయ్యాయి. అటవీ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది అర్ధరాత్రి నుంచి మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యారు. వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అటవీశాఖ అధికారులు తెలిపారు. కొండ చుట్టూ రోడ్లపై ప్రయాణికులు కొండలకు మంటలు ఏర్పడే అవకాశం కల్పించరాదని అటవీ శాఖ అధికారులు కోరారు.

ముగిసిన పీయూసీ పరీక్షలు



పరీక్షా హాల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కంప్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పీయూసీ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. మంగళవారం విద్యార్థులు చివరి రోజు కావడంతో ఒకరికొకరు పలకరించుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. రాబోయే నీట్, కేసెట్ ఇతర పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు తప్పని తిప్పలు

సిరుగుప్ప, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫుట్‌పాత్‌లో పెట్టుకున్న వ్యాపార దుకాణాలను నగరసభ ఆధ్వర్యంలో ఇటీవల తొలగించిన సంగతి తెలిసిందే. ఈ షాపులను వ్యాపారులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో పెట్టడంతో రెవెన్యూ అధికారులు ఇక్కడ వుంచరాదని వ్యాపారులకు తెలిపారు. దీంతో దుకాణాలను ఎక్కడ పెట్టుకోవాలో తెలియక వ్యాపారస్తులు తికమక పడుతున్నారు. నగరసభ అధికారులు వ్యాపారులకు పర్మినెంట్ స్థలం చూపాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మూతబడిన దుకాణాలు

హోసూరు జోన్

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు: మేయర్



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ సత్య

హోసూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని 45 వార్డులలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలపై కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి మేయర్ సత్య నేతృత్వం వహించగా కమీషనర్ (ఇన్‌చార్జ్) మారిసెల్వి అధ్యక్షత వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేవియర్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఎలక్ట్రీషియన్లు, తాగునీటి ఇన్‌స్పెక్టర్‌లు, తాగునీటి పంపిణీ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి సక్రమంగా సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా వెంటనే పరిష్కరించాలని మేయర్ సూచించారు. నీరు తక్కువ అందుతున్న బోరు బావులను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధం కావాలన్నారు.

చెత్త సేకరణ డిపోలో మంటలు

హోసూరు(క్రైం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): హోసూరు దిన్నూరు ప్రాంతంలో కార్పొరేషన్‌కు చెందిన చెత్త సేకరణ డిపో ఉంది. ఆయా ప్రాంతాల్లో సేకరించినవ్యర్థాలను సూక్ష్మజీవుల పద్ధతిలో ప్రాసెస్ చేస్తారు. అలాగే ఇక్కడ పాత ప్రైవేట్ ఫ్యాక్టరీలో బట్టలు రీసైకిల్ చేస్తుంటారు. ఈ సమయంల్లో ఒక టన్నుకుపైగా పాత దుస్తులు నిల్వ ఉండగా చెత్తకు నిప్పంటిచ్చినప్పుడు మంటలు భారీగా చెలరేగాయి. ఫ్యాక్టరీలోని పాత దుస్తులకు కూడా మంటలు వ్యాపించాయి. పొగ భారీగా రావడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. ఫైరింజన్‌లతో వచ్చి గంటకుపైగా శ్రమించి మంటలను నియంత్రించారు. ఘటనపై మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిప్పంటించిన దుండగులకోసం దర్యాప్తు చేపట్టారు.



ఎగసిపడుతున్న మంటలు

రూ.3.54 కోట్ల వైద్య పరికరాల అందజేత



ఆస్పత్రిలో కలెక్టర్ దినేశ్‌కుమార్, కంపెనీ ప్రతినిధి జీఎస్ఆర్ రావ్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి శూలగిరిలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ సీఎస్ఆర్‌లో భాగంగా రూ.3.54 కోట్ల విలువైన వైద్య పరికరాలను సమకూర్చింది. కలెక్టర్ దినేశ్‌కుమార్ సమక్షంలో మంగళవారం ఆసుపత్రిలో పరికరాలను అందచేశారు. ఈఎస్ఆర్ ఎనలైజర్, ఆర్ఎఫ్ అబ్లేషన్ మెషిన్, మొబైల్ ఎక్స్‌రే మెషిన్, ఈసీజి మెషిన్, హై ఎండ్ ఆఫ్ టేబుల్, జనరల్ సర్జరీ (వాల్యూమ్ సీఓటూ ఇన్‌సఫ్లేటర్‌తో 3 సీఎంఓఎస్ చికిత్స కోసం హెచ్‌డీ కెమెరాతో కూడిన లాప్రోస్కోపీ), ఆపరేటింగ్ లైట్, థియేటర్‌లో వినియోగించే కార్డియోటోకోగ్రఫీ (ఎగ్జామినేషన్ ల్యాంప్ విత్ వైట్ లైట్), ప్రోటీన్ విలువ తెలుసుకునే మిషన్, బ్లడ్ షుగర్ (సెమీ ఆటోమేటెడ్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్), బ్లడ్ డీసిజ్ ట్రీట్‌మెంట్ ఎక్విప్‌మెంట్ (ఎలిసా వాషర్), వర్క్‌స్టేషన్‌లో ఈ సెంటర్ (ఫౌలర్ కాట్) మ్యాట్రెస్, రేడియంట్ వార్మర్, మెడికల్ కళాశాల న్యూరో హాస్పిటల్ కేర్, కార్డియాలజీ విభాగాలు, క్యాథ్ ల్యాబ్‌లకు దోహదపడే పరికరాలు అప్పగించారు. ఈ సందర్భంగా పవర్‌గ్రేడ్ కంపెనీ, అధికారి జీఎస్ఆర్ రావ్, మేనేజర్ ఆర్.శరవణకుమార్ పాల్గొన్నారు.

సీఎం స్టాలిన్ ప్రకటనపై విద్యార్థుల హర్షం



మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

హోసూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాలేజ్ స్టూడెంట్స్‌కు ల్యాప్‌టాప్ ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సందర్భంగా 20లక్షల ల్యాప్‌టాప్‌లు, నోట్‌బుక్‌లను ఇస్తామని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే విద్యార్థి బృందం తరపున హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోనూ, ప్రైవేట్ మహిళా కళాశాలల్లో జిల్లా విద్యార్థి జట్టు ఆర్గనైజర్ కన్నన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

రైతులు.. పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తోరణగల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసురుసేన రాష్ట్ర కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం సండూరు తాలుకా అంతాపుర గ్రామంలో జలనైన అభివృద్ధి శాఖ బళ్లారి కృషి ఇలాఖే ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కృషి ఇలాఖే నుండి వచ్చే సౌలభ్యాలను ప్రతి రైతు ఉపయోగించుకుని సాగులో ఉత్తమ లాభాలు పొందాలన్నారు. ఉద్యాన పంటల్లో ప్రభుత్వం ఎన్నో రాయితీలు అందిస్తోందని, వాటికి ఉపయోగించుకుని లాభాలు పొందాలన్నారు. బ్యాకుఉలో రుణాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు హనుమక్క, రేవన్న, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొన్నారు.